



ఫొటో ఎగ్జిబిషన్ సందర్భంగా కేంద్ర కరువు బృందానికి వివరిస్తున్న జెసి నారపురెడ్డి మౌర్య

పేరు గొప్ప.. ఊరుదిబ్బ...

- గ్రామాలకు రాని మహిళా వలంటీర్లు - పలువురు ఉద్యోగ, వ్యాపార రీత్యా పట్టణాలకే పరిమితం
- పథకాల సమాచారం లేదని ప్రజల విమర్శ - డిడిఒలు సమాచారం ఇవ్వలేదంటున్న ఎంపిడిఒ - నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-సి బెళగల్

వలంటీర్ల వ్యవస్థ రాష్ట్రానికి కాదు. దేశానికే తలమానికం... ఇలాంటి వ్యవస్థను పెట్టడం ఎంతో మంచిది. లబ్ధిదారులకు అన్ని ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, ఇతర ఏ సమస్యలున్నా వెంటనే మండల స్థాయి అధికారులకు తెలుస్తుంది. తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు తెలుస్థాయి. నెలలో మొదటి రోజే పెన్షన్ దారుల ఇంటికి వెళ్లి అందజేస్తున్నారని పాలకులు బహిరంగ సభల్లో చెబుతున్నారు. ఇదంతా ఒక్క వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందని చెబుతున్నారు. వలంటీరు అంటే స్వచ్ఛందంగా పని చేసే వారని అర్థం. వైసిపి ప్రభుత్వం వారికి గౌరవ వేతనం పెట్టింది. అదెంతయినా ప్రభుత్వ సొమ్ము కొంత ఇస్తున్నారు. దానికి కనీస అటెండెన్స్ నెలలో 20 రోజులు సచివాలయంలో హాజరు కావాలి. ఆ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాల పరిస్థితులను తెలియజేయాలి. ఒకటో తారీకు మాత్రం పెన్షన్లు అందజేయాలి. అన్నింటిలో ఒకటి మాత్రం అమలవుతుంది. పెన్షన్లు అందజేయడం... మిగతావి వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటుంది. వైసిపి ప్రభుత్వం లక్ష్యం ఒకింత నీరుగారుతుంటే వారి పైఅధికారుల పర్యవేక్షణ ఏపాటిదో సిబెళగల్ మండలంపై ప్రత్యేక కథనం....

సిబెళగల్ మండలంలో 16 సచివాలయాలు, 18 పంచాయతీలు ఉన్నాయి. అందుకనుగుణంగా 259 వాలంటీర్లను నియమించారు. ఇందులో 75 మంది మహిళలకు అవకాశం కల్పించగా ప్రభుత్వ పథకాలు, పలు సమాచారాలు ప్రజలకు అందజేసే క్రమంలో వలంటీర్లు విశిష్టతను చాటుకుంటున్నారు మొదట్లో... రానురాను అనేక మార్పులొచ్చాయి. ఇతర ప్రాంతాలకు ఉద్యోగం వచ్చి వెళ్లిన వారు. పెళ్లిళ్లయి భర్తల ఊరికి వెళ్లిన వారు... డిగ్రీలు, పిజిలు చదివిన వారు ఈ ఐదు వేలతో ఏమవుతుందని ప్రయివేటులో పెద్ద ఉద్యోగాలు వచ్చిన వారు. మొత్తంగా వలంటీరు వ్యవస్థ లక్ష్యం నెరవేరడం లేదని మండల ప్రజలు చర్చిస్తున్నారు.

కొత్తకోటలో రజని, బెళగల్‌లోని నాగమ్మ, సువర్ణ, మారందొడ్డిలో శిరీషా, సుధారాణి, సంఘాలలో సరళ, యనగండ్లలో ప్రశాంతి, ఈ మహిళా వలంటీర్లు పెళ్లిళ్లు అయ్యాక అత్తారింటికి వెళ్లారు. వారి ఊర్లోనే వలంటీర్లుగా కొనసాగిస్తుండడంపై అధికారుల పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలకు ఒక్క రోజు రావడం పింఛన్లు ఇచ్చి వెళ్లి పోతున్నారు. కొండాపురంలో గిరిజ, ముడుమాలలో మమతలు కర్నూలులో వారి కుటుంబాలు వ్యాపార రీత్యా స్థిరపడి నెలలో నాలుగు రోజులు మాత్రమే గ్రామానికి వచ్చి వెళ్లడంతో సంబంధించిన కుటుంబాలకు సజావుగా సేవలు అందడం లేదని తెలిసింది. తిమ్మందొడ్డిలో శైలజ భర్త, భారతి భర్త, కొండాపురంలో జ్యోతి భర్త ఉద్యోగ రీత్యా కర్నూలులో స్థిరపడి ఇష్టమొచ్చినప్పుడు రావడం.. వెళ్లడం పరిపాటిగా మారింది. ఇక కంబదహాల్, సిబెళగల్, తిమ్మందొడ్డి, కొండాపురం, బురాన్‌దొడ్డి, సంఘాల, ఈర్లదిన్నె వంటి గ్రామాల్లో భార్యలకు బదులు భర్తలు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు హౌస్ మ్యాపింగ్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఇవ్వడానికి, ఆధార్ లింక్, ఆధార్‌లో పేర్లు మార్పులు కొత్తగా సభ్యులను చేర్పులు, కొత్తగా పింఛన్లు, ఇళ్లు, జనన, మరణ ధృవపత్రాలు, బీమా పథకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడటం, తదితర కీలకపరమైన సేవలు సకాలంలో అందక ప్రజలు, రైతులు, విద్యార్థులు వారికీ చెందిన కుటుంబాలకు పలు పథకాలు దరి చేరక అవస్థలు పడుతున్నారు. పలు సందర్భాల్లో పలు పథకాలకు ఆ వలంటీర్లు సకాలంలో లేనందున చివరి గడువు తేదీలలో వచ్చి పలు ధ్రువీకరణ పత్రాలు అందించేవారు లేరని ఆందోళన చెందున్నారు. తిమ్మందొడ్డిలో శైలజ, భారతిలు స్వగ్రామంలోనే పెళ్లిళ్లు చేసుకోగా భర్తలు కర్నూలులో ఉద్యోగాలు చేస్తున్నారు. పలువురు వలంటీర్లు కొంచెం ఇష్టం, కొంచెం కష్టంతో సంక్షేమ పథకాలపై తెలుపడం, లేదంటే అసలు పట్టీపట్టనట్లుగా ఉండటం, వారికీ నచ్చినోళ్లకు, మాత్రం సక్రమంగా పని చేయడం అలవాటుగా మార్చుకొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సభలకు, నాయకుల సమావేశాలకు హాజరై అధికారుల దగ్గర మార్కులు కొట్టేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సమావేశాలకు హాజరు కాని వారు కూడా ఉంటున్నారు. ఇలాంటి సంతృప్తినివ్వని సేవలు అందించిన వారికే అధికారులు వజ్ర, స్వర్ణ, రజత అవార్డులు అందించడం విడ్డురంగా ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదే వలంటీర్లు అనర్హులకే అధికంగా పథకాలు అందించారని, గిట్టని వారి పట్ల స్పందన చూపడం లేదని, ఏవైనా దరఖాస్తు చేయుటలో తప్పులు దొర్లించి ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు కళ్ళబొల్లి సమాధానాలను ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా వినికిడి లోపం లేకున్నా, భర్త ఉన్నా వితంతుగా, 45 నిండకున్నా చేయూత పథకాలు, వయసు 45 లేదా 50, 60 లోపు ఉన్నా వృద్ధాప్య పింఛన్, అనర్హులకు దర్జీ, ఆయా వృత్తుల వారికి ప్రోత్సాహకాలు అందించి సొమ్ములు చేసుకొని ప్రభుత్వ ఆర్థిక లోటుకు కారణమైనట్లు తెలుస్తోంది. మరో కోణంలో విశిష్టతను చాటని వాలంటీర్లను తొలగించి పొరుగు నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడంలో అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో వారికీ కూడా ఇలాంటి వాలంటీర్ల నుండి ముడుపులు అందుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీకి కొమ్ము కాస్తూ చెప్పినోళ్లకు వలంటీర్ పోస్టులు అధికంగా ఇచ్చారని, ఎవరినైనా మారిస్తే వైసిపి నాయకులతో చెడ్డపేరు వస్తుందనే అపవాదు మాకెందుకు అనే అధికారులు ఉన్నారు.

డిడిఒల అసమర్థతతోనే చర్యలు చేపట్టలేక పోతున్నాం : ఎంపిడిఒ

వలంటీర్లకు సంబంధించిన డిడిఒ లు అసమర్థత చూపిస్తూ వస్తున్న ఫిర్యాదులు స్వీకరించడం లేదు. కనీసం మండల స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వడం లేదు. ప్రధానంగా వలంటీర్లు పెళ్లిళ్లు అయినా, చదువుతున్నా, పని తీరు బాగా లేకున్నా తొలగించి వేరొకరికి అవకాశం ఇవ్వాలి. నెలలో 20 రోజులు రికార్డు ప్రకారం సచివాలయానికి హాజరు కావాల్సి ఉంది. చాలా మంది నెలకు 6 నుండి 12 రోజులు కూడా హాజరు లేదు. కొందరు 2, లేదా 3రోజులు అందుబాటులో ఉంటున్నారు. కలిపి ముందుగానే సంతకాలు చేసి వెళ్లిపోతున్నట్లు తెలిసింది. డిడిఒల పనితీరుపై సమీక్షిస్తాం.

కరువు నష్టం రూ.371 కోట్లు

- సాయం చేసి ఆదుకోండి
- కరువు బృందానికి విన్నవించిన రైతులు
- కరువు పరిస్థితులపై బృందానికి నివేదించిన జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ ఏడాది ఏర్పడిన కరువు పరిస్థితుల వల్ల దాదాపు రూ.371 కోట్ల నష్టం వాటిల్లిందని జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేసి కేంద్ర బృందానికి నివేదించింది. ఇందులో వ్యవసాయ శాఖ కింద రైతులు సాగు చేసి నష్టపోయిన పంటలకు పరిహారం కింద రూ.284.63 కోట్లు ఇవ్వాలని నివేదించింది. కరువు పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదికను జెసి నారపురెడ్డి మౌర్య కేంద్ర కరువు బృందానికి నివేదించారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బుధవారం కేంద్ర కరువు బృందం పలు మండలాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా రైతుల పంటల పొలాలను పరిశీలించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కరువు బృందం పరిశీలించింది. కర్నూలు జిల్లాలో దాదాపు 1.67 లక్షల హెక్టార్లలో పత్తి పంట నష్టపోయినట్లు నివేదించారు. 4,540 మంది రైతులు సాగు చేసిన పంట పొలాలు చేతికందక రూ.284.63 కోట్లు నష్టం వాటిల్లిందని నివేదికలో వెల్లడించారు. వీటితోపాటు వేరుశనగ, కంది పంటలు కూడా పూర్తిగా దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. ఉద్యాన వన పంటల సాగు కింద ఉల్లి, టమోటా, పచ్చి మిర్చి దాదాపు 36 వేల హెక్టార్లలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు కరువు బృందానికి నివేదించారు. వీటితోపాటు కరువు మండలాల్లో పశుగ్రాసం కొరత, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని నివేదించారు.

ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన

కర్నూలు జిల్లాలోని మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితులపై కలెక్టర్ కేంద్ర కరువు బృందం సభ్యులకు వివరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ, పశుసంవర్ధక, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్, జిల్లా నీటియాజమాన్య సంస్థలు కరువు పరిస్థితులపై ఫొటోల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా అన్ని వివరాలను జెసి వివరించారు.

కరువు సాయం చేసి ఆదుకోవాలి

కేంద్ర కరువు బృందం ఫొటో ఎగ్జిబిషన్ సందర్శన అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో కరువు పరిస్థితులపై పూర్తిస్థాయి నివేదికను అందజేశామని తెలిపారు. కరువు సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన వన పంటల నష్టంపై పూర్తిస్థాయి అంచనాలు తయారు చేసి పంపామని చెప్పారు. ఉపాధి పనుల పెంపునకు గాను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లాలో శాశ్వత కరువు నివారణకు కూడా పూర్తిస్థాయిలో చర్యలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించామన్నారు. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, సిపిఒతోపాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

కేంద్ర కరువు పరిశీలన బృందాన్ని అడ్డుకున్న రైతులు
ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్న బృందం

ప్రజాశక్తి-తుగ్గలి



కరువు బృందానికి వినతిపత్రం ఇస్తున్న సిపిఐ, టిడిపి నాయకులు

తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ బుధవారం కేంద్ర కరువు పరిశీలన బృందాన్ని జొన్నగిరి గ్రామం వద్ద తుగ్గలి మండల రైతులు అడ్డుకున్నారు. కరువు బృందం అనంతపురం జిల్లా నుండి కర్నూలు జిల్లాలో కరువు పరిస్థితులను పరిశీలించేందుకు జొన్నగిరి మీదుగా జిల్లాలోకి ప్రవేశించింది. సిపిఐ ,టిడిపి ,కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో రైతులు కేంద్ర కరువు పరిశీలన బృందాన్ని డ్డుకున్నారు. తుగ్గలి మండలంలో వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ,పంటల సాగు కోసం రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతులు అడ్డుకొని నిరసనను తెలిపారు. అనంతరం రైతులు కేంద్ర కరువు పరిశీలన బృందం అధికారి అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు నబి రసూల్, సుల్తాన్, రోల్లపాడు వెంకటేష్, టిడిపి నాయకులు మనోహర్ చౌదరి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, రాతన ఈరమ్మ, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి క్రాంతి నాయుడులు మాట్లాడుతూ మండలంలో దుర్భరమైన కరువు పరిస్థితిని వివరించారు. ఇప్పటికే చాలామంది రైతులు మండలంలో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని వారు గుర్తు చేశారు . సిపిఐ, సిపిఎం రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. వినతిపత్రం స్వీకరించిన కరువు బృందం సభ్యులు ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

- రెండో రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్ : న్యాయమైన డిమాండ్ల కోసం అంగన్వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అంగన్‌వాడీలకు సూచించారు. అంగన్వాడి ఆయాలు టీచర్ల వేతనాలు పెంపు కోసం గ్రాడ్యుటీ అమలు చేసి పని భారం తగ్గించాలని, చాలా కాలంగా శాంతియుతంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని కానీ జగన్ ప్రభుత్వం చాలా మొండిగా అహంకారపురితంగా వ్యవహరిస్తున్నదని సిఐటియు జిల్లా నాయకులు పి.నిర్మల, ఎం.గోపాల్, కె.సుధాకరప్ప, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రామాంజనేయులు న్యాయమైన హక్కుల కోసం అంగన్వాడీలు పిడికిలి బిగించి పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అంగన్ వాడీలను కోరారు. అంగన్వాడి ఆయాలు టీచర్ల వేతనాల పెంపు కోసం గ్రాడ్యుటీ అమలు కోసం పని భారం తగ్గింపు కోసం చాలా కాలంగా శాంతియుతంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం చాలా మొండిగా అహంకారపురితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అంగన్వాడీలపై వేధింపులకు గురి చేస్తే జగన్ ప్రభుత్వానికి 1,20,000 మంది అంగన్వాడీ కుటుంబాలు టీచర్లు ఆయాలు జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని హెచ్చరించారు. ఈరోజు ఉన్న ధరల కనుగుణంగా రూ.26,000 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె ఉధతమైతే ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండో రోజు కొనసాగిన ఈ సమ్మెకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నబి రసూల్. ఐలు జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మన్న ,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె. అరుణ , ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న డిసిసి అధ్యక్షులు బాబురావు ,పిసిసి ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జనసేన నాయకులు హర్షద్‌లు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పట్టణ మురికి వాడలలో పిల్లలకు గర్భిణీలకు అమ్మల లాగా సేవలందిస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం చాలా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా 700 సెంటర్ల నుండి ఈరోజు సమ్మెలో 1400 మంది అంగన్వాడీటీచర్లు ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు బి రేణుకమ్మ, ఎఐటియుసి అంగన్వాడి నాయకురాలు సుగుణమ్మ, సిఐటి యు అనుబంధ అంగన్వాడి యూనియన్ నాయకురాలు బాలదుర్గమ్మ నాయకత్వం వహించారు.



సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు బాబురావు



వీరబ్రహ్మం కళారూపకంలో ఓ సన్నివేశం

రైతాంగ పోరాట స్ఫూర్తితో ముందుకు

పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నల్ల చట్టాల రద్దు కోసం ఢిల్లీలో రైతులు చేపట్టిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిఎన్ఎమ్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ అన్నారు. ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ పిఎన్ఎం ఆధ్వర్యంలో మూడవరోజు కర్నూలు పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద సాంస్కృతిక సంబరాలను అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలు అభ్యుదయ గేయాలతో అలరించారు. పోతులూరి వీరబ్రహ్మం నృత్య రూపకం సమాజంలోని కులమత బేధాలను చేధించాలని మానవులంతా సమానమంటూ ఇచ్చిన సందేశాన్ని ప్రజల మనసుల్లో నాటుకునేలా చేసింది. శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్ రావు నటించిన పౌరాణిక ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా కార్తీక్ వైద్యశాల అధినేత డాక్టర్ చంద్రశేఖర్, శిరీష, సామాజిక సేవకులు గజల్ గాయకుడు మహమ్మద్ మియా హాజరయ్యారు. అతిధులకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఎంపిబసవరాజు , సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు కన్వీనర్ జెఎన్ శేషయ్య, సిఐటియు జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ జ్ఞాపికలను అందజేశారు.అనిల్ మాట్లాడుతూ దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి జరుగుతుందన్నారు. కట్టుకునే బట్ట నుండి తినే తిండి వరకు స్వేచ్ఛ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం పోరాటం అన్ని పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి నాగరాజు జిల్లా నాయకులు లోకేష్, నోమేశ్వరి, బాలన్న, సుంకన్న, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, లక్ష్మి, ముని పాల్గొన్నారు.



ఈ-పంట బీమా నమోదుతో గిట్టుబాటు ధరలు

ప్రజాశక్తి-సి బెళగల్

ఈ పంట, పంట బీమా నమోదు తోనే గిట్టుబాటు ధరలను అందుకోవచ్చని ఎఒ మల్లేస్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం కంభదహాల్ లో ఆకస్మికంగా రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రత్తి, జొన్న పంటలను పరిశీలించి రబీ సాగుపై అవగాహన కల్పించారు. ఈ పంట, పంటల బీమాతోనే గిట్టుబాటు ధరలు, పంట నష్టపరిహారం వంటివి అందుకోవచ్చని పేర్కొన్నారు.

రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలి

-తక్షణం సాయం అందించాలి - జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి
-కరువు బృందానికి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి : కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని, కేంద్ర కరువుబృందం ప్రతినిధి నీతి అయోగ్ సీనియర్ రీసర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నాకు ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి వినతిపత్రం సమర్పించారు. ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రంలో 679 మండలాలు ఉంటే సుమారు 400 మండలాల్లో ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, చాలా తక్కువ వర్షపాతం నమోదు అయిందని, 85 లక్షల ఎకరాల్లో సాధారణ సాగు కావలసి ఉండగా వర్షాభావ పరిస్థితుల వల్ల సుమారు 26 లక్షల ఎకరాలు ఖరీఫ్ సీజన్లో ఎలాంటి విత్తనాలు పడలేదని పేర్కొన్నారు. చాలా ప్రాంతాలలో వేసిన పంటలు కూడా తక్కువ వర్షపాతం, డ్రై స్పెల్ కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని సాధారణ దిగుబడి కంటే 30 నుంచి 40 శాతం దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితులలో రాష్ట్ర రైతాంగాన్ని ఉదారంగా ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని పేర్కొన్నారు. కర్నూలును మొత్తం కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు, పేదలకు, వ్యవసాయ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం , రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల్లో కరువు సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒక్క కర్నూలు జిల్లాలో 10, 53, 900 ఎకరాలు సాగు కావల్సి ఉండగా వర్షాభావంతో కేవలం 7,50,000 ఎకరాలలో మాత్రమే సాగయిందని అందులో అత్యధిక పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటల నష్టాన్ని బట్టి ఎకరాలకు రూ.25వేల నుంచి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండ, అలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలలోని గ్రామీణ ప్రాంతంలోని పేదలు, వ్యవసాయ కూలీలు, పేద రైతులు సుమారు రెండు లక్షల మందికి పైగా వలస వెళ్లారని, గ్రామాలకు గ్రామాలే జీవనోపాధి కొరకు తరలి వెళ్లిన దయనీయ పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి 100 రోజుల నుండి 200 రోజుల పని దినాలు కల్పించాలని పనికి చెల్లించే రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని, తక్షణం వ్యవసాయ కార్మిక కుటుంబాలకు రూ. పదివేల ఆర్థిక సాయం అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న అన్ని కుటుంబాలకు 14 రకాల నిత్యావసర వస్తువులు చౌక డిపోల ద్వారా అందించాలని, రైతులు, కౌలు రైతుల సమస్యలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి , రామకృష్ణ, నారాయణ, గౌస్ దేశాయి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ .జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను, కర్నూలు నగరంలో జరిగిన అభివృద్ధి పనులను ,సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీజ్‌ఖాన్ వైసిపి సోషల్ మీడియా బృందానికి సూచించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కార్యాలయం రాయల్ ఫంక్షన్ హాల్ లో వైఎస్ఆర్ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి తప్పుడు ప్రచారాన్ని రాష్ట్రంలో తిప్పికొట్టాలని కర్నూలు సూచించారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని అన్నారు. సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో టిడిపి ఎల్లో మీడియా ద్వారా ప్రజలను మభ్యపెట్టెందుకు ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు చేయలేని విధంగా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మన్సూర్, కో కన్వీనర్లు ఎండి హనీఫ్, ఖయ్యుమ్,ఖాసీం,సతీష్, ప్రసాద్, భాను, ఫారజ్ ఖాన్, హనీఫ్,రసూల్, రవి, ఇంతియాజ్, షకీల్, తాహెర్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలలో వైసిపికి సింగిల్ డిజిట్ : బిటినాయుడు

ఓటమి భయంతో అభ్యర్థులను మార్పు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ళలో ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని, ప్రజలలో నమ్మకం సన్నగిల్లిందని, రానున్న 2024 ఎన్నికల్లో సింగిల్ డిజట్ రావడం ఖాయని టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు జోస్యం చెప్పారు. బుధవారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖచ్చితంగా ఓడిపోతానన్న భయంతోనే ప్రజల దృష్టిని మరల్చాలని ఎమ్మెల్యే అభ్యర్థులను, ఇన్‌ఛార్జులను మార్చుతున్నారని అన్నారు. బిసిల జపం చేయడం, సామాజిక న్యాయం వంటి కొత్త నాటకానికి తెరతీశారన్నారు. ఒక్క అవకాశమని మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని ఆ తర్వాత కొనసాగించిన దగాకోరు, అవినీతి, అక్రమాలతో, చంద్రబాబు పాలనలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాన్ని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం, అతః పాతాలానికి నెట్టివేశారని ఆరోపించారు. ప్రజలు దీన్ని గమనించారని, అందుకే ఇన్చార్జీలను మాత్రమే మారుస్తున్న జగన్‌ను రానున్న రోజులలో రాష్ట్ర ప్రజలు మార్చబోతున్నారని తెలిపారు. మంగళగిరిలో గెలుస్తారని తెలిసినప్పుడు సీటు రెడ్డి సామాజిక వర్గం వారికిచ్చిన జగన్ ఇప్పుడు ఓడిపోతామని తెలిసి బిసిలకు ఇచ్చేందుకు నిర్ణయించారని, ఇది బిసి. లపట్ల జగన్‌కు ఉన్న కపట ప్రేమకు నిదర్శనమన్నారు. జగన్ మంత్రుల స్థానాలను మార్చుచున్నారంటే శాఖా పరంగా వారు విఫలమయ్యారనే చెప్పకనే చెప్పారున్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఎమ్మెల్యేలున్న చోట్ల తన సామాజికవర్గం షాడోలతో పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ఇప్పుడు ఆయా వర్గాల సీట్లతో ఆటలాడుతున్నారని గుర్తుచేశారు. ఇటీవల 108 నియోజకవర్గములలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వై సి పి, వారిని ఘోరంగా తిరస్కరించి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించారంటే వారి పాలన ఎలా ఉందో తేటతెల్లమైందని అన్నారు. జగన్ పాలనలో 300 మందికి పైగా బిసిలను, 188 మంది దళితులను, 63 మంది గిరిజనులను అత్యంత ధారణంగా హత్యలు చేయించారని చెప్పారు. అందుకే ప్రజల ఆశీర్వాదంతో ఆంధ్ర రాష్ట్రంలో రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు.

యువత టిడిపికి మద్దతివ్వడం సంతోషం

టిడిపి కర్నూలు ఇన్చార్జి టిజి భరత్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్



కర్నూలు నగరంలోని యువకులు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వడం సంతోషకరమని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని 4, 5 వార్డులకు చెందిన యువకులు టిడిపి నగర మహిళా విభాగం అధ్యక్షులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టిజి భరత్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిజి.భరత్ మాట్లాడుతూ యువత భవిష్యత్తు టిడిపితో ముడిపడి ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిస్తే ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు వస్తాయని వివరించారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. ప్రజల్లో యువత చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. పార్టీలో చేరిన వారిలో రాజేష్, అరవింద్, అబ్బాస్, లోకేష్ ఉన్నారు. స్థానిక బూత్ ఇంచార్జి అనిల్, టిడిపి నాయకురాళ్లు విజయలక్ష్మి, లలితమ్మ, అసెంబ్లీ నియోజకవర్గం మహిళా కమిటీ అధ్యక్షురాలు మారుతీ శర్మ, ఉపాధ్యక్షురాలు సౌభాగ్యమ్మ, పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- ఆర్‌డిఒ రామలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

పొలం సమస్యలపై రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులు తిరగని వ్వకుండా సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో నంచర్ల గ్రామంలో రైల్వే డబుల్ లైనుకు భూములు కోల్పోయిన 9 మంది రైతులకు రూ.6.40 లక్షల చెక్కులను ఆర్‌డిఒ రామలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నంచర్ల గ్రామ సమీపంలో రైల్వే డబుల్ లైన్‌కు భూములు కోల్పోయిన 9 మంది రైతులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు అందే విధంగా చేశామన్నారు. మండలంలో రెవెన్యూ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ బాబు, సీనియర్ అసిస్టెంట్ మధుస్వామి, రెవెన్యూ కార్యదర్శులు మల్లికార్జున, రంగన్న, తిమ్మప్ప, పెద్దన్న, ఈరన్న, కిష్టప్ప, నాయక్, సునీత పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఆర్‌డిఒ రామలక్ష్మి

ఉద్యోగ భద్రత కల్పించండి : ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ చట్టంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బుధవారం చిప్పగిరిలో ఏపీఓ నాగలక్ష్మి, తహశీల్దార్ లక్ష్మినారాయణకు మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆనంద్, మారుతి ప్రసాద్, లక్ష్మన్న, పులి రాజు, నాగరాజు, రఘు, దేవేంద్ర, కదిరప్ప, ఒబులేసు, రాధాకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలన్నారు. రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. నెలలు తరబడి పెండింగ్ లేకుండా ప్రతినెలా వేతనాలు వచ్చేలా చూడాలన్నారు. **దేవనకొండ**లో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపిడిఒ గౌరీదేవికి వినతిపత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చిన్న గిడ్డయ్య, విరుపాక్షి, శ్రీరాములు, రామప్ప, రాఘవేంద్రలు మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న కర్నూలులో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

- డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

నేటి బాలలే రేపటి పౌరులతో పాటు శాస్త్రవేత్తలు కూడా అవుతారని డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆదోని నెహ్రూ స్మారక పురపాలక హైస్కూలులో ప్రధానోపాధ్యాయులు హలీం సిద్ధిఖీ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల్లోని కొత్త తరం సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసే ప్రయత్నం నిరంతరం జరుగుతూనే ఉండాలని తెలిపారు. విద్యార్థులకు సాంకేతికతతో పాటు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించడంలో సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయని చెప్పారు. న్యాయనిర్ణేతలు రవి, ఆదిమూర్తిలు జిల్లా స్థాయి విజేతలను ఎంపిక చేశారు. ఎంఇఒ శివ రాములు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు రామయ్య, సుధాకర్, ప్రసాద్, సురేష్, రాధ, రేణుక, ఆనంద్ పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి కృషి'

ప్రజాశక్తి - కోసిగి

రైతుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగి మండల కందుకూరు గ్రామంలో దాదాపు రూ.12 కోట్లతో చేపట్టనున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేపట్టారు. ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయి మాట్లాడారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కృషితో నియోజకవర్గంలో 5 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. 2 ప్రాజెక్టులు ఐరనగల్లు, కందుకూరులు మండలానికి చెందినవని తెలిపారు. కందుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కందుకూరు, కామన్‌దొడ్డి, ముగలదొడ్డి, ఆర్లబండ గ్రామాలకు చెందిన దాదాపు 1200 ఎకరాలకు వచ్చే 4 నెలల్లో పూర్తి చేసి సాగునీరు అందించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, యువనేత వై.ధరణీ రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మైనర్ ఇరిగేషన్ శాఖ డిఇ నాగార్జున రావు, ఎఇ నారాయణ రెడ్డి, సైట్ ఇంజినీర్ విజయ్, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్, గ్రామ పెద్దలు శరణప్ప గౌడ్, నాయకులు తాయన్న, రమేష్, మల్లయ్య, భీమిరెడ్డి, నారాయణ, నాగిరెడ్డి, రామన్న హాజరయ్యారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు...

- మొక్కుబడిగా కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలంలో కరువు బృందం పర్యటన మొక్కుబడిగా సాగింది. 'ఇలా వచ్చారు..అలా వెళ్లారు..' అనే రీతిలో వారి పర్యటన సాగింది. పంటలు పండక ఓ వైపు రైతులు అల్లాడుతున్నారు. కరువు కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. కరువును అధ్యయనం చేసేందుకు కేంద్రం నుంచి అధికారుల బృందం వస్తోందని తెలిసి, కాస్త ఊపిరిపీల్చుకున్నారు. కరువుతో కొట్టుమిట్టాడుతున్న తమ బతుకులకు కాస్తయినా భరోసా దొరుకుతుందని ఆశపడ్డారు. వారి ఆశలను కేంద్ర బృందం అడియాశలు చేసింది. కరువు ప్రాంతాలను తూతూమంత్రంగా పది నిమిషాల్లో పంటలు పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి వెళ్లిపోయారు. పంటపొలాల్లో కలియదిరిగి, రైతు సమస్యలను తెలుసుకొని, కేంద్రానికి నివేదిక అందించడం వారి కర్తవ్యం. అవేమీ పట్టకుండా ఏదో విహారయాత్రకు వచ్చినట్లు.. ఎంజాయ్ చేసి వెళ్లిపోయారని రైతులు వాపోతున్నారు. ఆదోనిలో కరువు బృందం అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని విరుపాపురం గ్రామంలో దెబ్బతిన్న టమోటా, మిర్చి పంటలను కేంద్ర కరువు బృందం సభ్యులు నీతి అయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బట్నా, జలశక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుద్ధ్య విభాగం అసిస్టెంట్ అడ్వయిజర్ సంతోష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అండర్ సెక్రెటరీ సంగీత్ కుమార్ కేవలం 10 నిమిషాల్లోనే రెండు పొలాల్లో తిరిగి, ముగ్గురు రైతులతో మాట్లాడి వెళ్లిపోయారు. తూతూమంత్రంగా పంట పొలాలను పరిశీలించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేంద్రంతో పాటు స్థానిక అధికారుల వైఖరిపై రైతులు మండిపడుతున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు తమ సమస్యలను పూర్తిగా విన్నవించుకోనివ్వలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సిపిఒ హిమప్రభాకర్ రాజు, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, జెడిఎ వరలక్ష్మి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎఒ అశోక్ కుమార్ రెడ్డి, హార్టికల్చర్ హరేంద్ర, ఎపిఒ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య, ఎపిఎం జనార్ధన, సర్పంచి ప్రహ్లాద్ యాదవ్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని కప్పట్రాళ్ల, నెల్లిబండ గ్రామ శివారులో కేంద్ర కరువు బృందం సభ్యులు, నీతి అయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి అనురాధ బట్నా, జల శక్తి మంత్రిత్వ శాఖ, తాగునీరు, పారిశుధ్య అసిస్టెంట్ అడ్వయిజర్ సంతోష్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ రీసెర్చ్ సెక్రటరీ సంగీత్ కుమార్ హాజరై రైతులతో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కరువు పరిస్థితులను, సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కరువుతో పూర్తిగా దెబ్బతిన్న ఆముదం పంటను వారు పరిశీలించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువుతో తీవ్రంగా నష్టపోయామని, రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని దేవనకొండ, అలారుదిన్నె గ్రామాలకు చెందిన రైతులు మల్లికార్జున, ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ సలహా సంఘం మండలి అధ్యక్షులు నేలతలమర్రి హంపి రెడ్డి, వ్యవసాయ కార్మిక, ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు వీరశేఖర్, నరసరావు కేంద్ర కరువు బృందం సభ్యులకు విన్నవించారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, ఏపీడీ పద్మావతి, పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని బిల్లేకల్లు, చిరుమాన్‌దొడ్డి గ్రామాల్లో కేంద్ర కరువు బృందం పర్యటించింది. కరువు బృందానికి రైతుల సమస్యలను విన్నవించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు హనుమంతు, రైతుసంఘం తాలూకా కార్యదర్శి నాగేంద్రప్ప మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బాలకృష్ణ, రంగస్వామి, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు జయన్న, శ్రీకాంత్, రంగన్న, ఉరుకుందప్ప, అంజినయ్య పాల్గొన్నారు.



ఆదోనిలో పంట పొలాలను పరిశీలిస్తున్న కరువు బృందం



దేవనకొండలో కరువు బృందానికి విన్నవిస్తున్న వీరశేఖర్



ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఆర్చి చెక్ డ్యామ్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని పుట్టకల మర్రి గ్రామ సమీపంలో ఎర్ర వంక దగ్గర రిలయన్స్ ఫౌండేషన్, ఆపాడ్ సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టనున్న ఆర్చి చెక్ డ్యామ్ నిర్మాణానికి సర్పంచి విశాలాక్షి, జాషువా ఫౌండేషన్ వ్యవస్థాపకులు దేవేంద్ర బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రిలయన్స్ ఫౌండేషన్, ఆపాడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆర్చి చెక్ డ్యామ్‌ను 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ చెక్ డ్యాం నిర్మాణం ఒక కిలోమీటరు భూగర్భ జలాలు పెరగడానికి దోహద పడుతుందని చెప్పారు. దాదాపు 20 ఎకరాల వరకు పంట పొలాలకు భూగర్భ జలాలు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ ఆర్చి చెక్ డ్యామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసిపి నాయకులు శివా రెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్, ఆపాడ్ సంస్థల నిర్వాహకులు యంకప్ప, రాజారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సురేంద్ర, రైతులు కుమార్, నరసింహులు, రంగస్వామి పాల్గొన్నారు.

'15న ప్రదర్శనను జయప్రదం చేయండి'

ఆదోని : ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా 15న జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న కోరారు. బుధవారం ఆదోని పట్టణంలో ఆటో ప్రచార జాతా నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారని విమర్శించారు. ఒక వైపు వ్యవసాయ, పెట్టుబడులు పెరిగిపోయాయని, మరోపక్క వ్యవసాయ రంగానికి ప్రభుత్వ సహకారం రోజురోజుకు తగ్గిపోతుందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్ల ధరలు పెరిగిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయంలో పెట్టుబడికి తగినంత ఆదాయం రాకపోవడం వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతుల దయనీయ స్థితిని ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చేందుకు జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పట్టణ నాయకులు లక్ష్మన్న, తిప్పన్న, గోపాల్, ముక్కన్న, అజీమ్ ఖాన్, కృష్ణమూర్తి, మనోహర్ పాల్గొన్నారు.

ఆట స్థలాలు పరిశీలన

కౌతాళం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేసేందుకు అధికారులు, నాయకులు ఆట స్థలాలను పరిశీలించారు. బుధవారం మండలంలోని ఎరిగేరి, కౌతాళం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆటో స్థలాలను పరిశీలించారు. ఆట స్థలాలను ఎంపిడిఒ సుబ్బరాజు, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి పరిశీలించారు. కౌతాళం సర్పంచి పాల్ దినకర్, ఎరిగేరి సర్పంచి గోవిందు, ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, ఇమ్మానుయేల్, స్కూల్ కమిటీ ఛైర్మన్ వడ్డే రామన్న, పంచాయతీ సెక్రటరీ యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - ఆస్పరి

డీజిటల్ సేవపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని ఎంఇఒలు రాజేంద్రప్రసాద్, తిరుమల రావు తెలిపారు. బుధవారం ఆస్పరిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వికలాంగులకు మూడు ట్యాబ్‌లు అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వం కార్పొరేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందిస్తోందని తెలిపారు. వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ వీరశేఖర్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ విజయవంతం



ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ బుధవారం విజయవంతమైంది. సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ప్రధానోపాధ్యాయులు ఎన్ఎండి.నజీర్ అహమ్మద్, పిసి కమిటీ ఛైర్మన్ సిద్ధయ్య, ఎంఇఒ-1 సత్యనారాయణ, ఎంఇఒ-2 జగన్నాథం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డేవిడ్, ఎల్లార్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మంగయ్య, చంద్రశేఖర్ హాజరయ్యారు. కమిటీ అధ్యక్షులు సిద్ధయ్య రిబ్బన్ కట్ చేసి మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్, మ్యాథ్స్, మోడల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రూపు విభాగంలో హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ప్రవల్లిక, పూజ తయారు చేసిన మోడల్, వ్యక్తిగత విభాగంలో హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.అనూష తయారు చేసిన మోడల్, టీచర్ విభాగంలో కెజిబివి టీచర్ కె.మాధురి తయారు చేసిన మోడల్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి

ప్రజాశక్తి-ఆలూరు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీలు రెండో రోజూ బుధవారం ఆలూరు పాతబస్టాండ్ ఆవరణలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి పాల్గొని మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీలో చేర్చాలని, వర్కర్లకు, హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని అన్నారు. సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్ షాకీర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేంద్ర నాయుడు, మండల అధ్యక్షులు రామాంజి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, గోవర్ధన్ మద్దతు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ, నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆదోని**లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రెండో రోజు అంగన్వాడీల సమ్మెకు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్వాడీలకు అండగా ఒక్క టిడిపి ప్రభుత్వమే ఉందన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, ఆదోని మండలం మాజీ ఎంపిపి మురళీ, రాఘవేంద్ర రెడ్డి, భరత్ కుమార్, ఈరన్న, పెద్దతుంబళం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం శ్రీనివాసులు, నరసప్ప, అంగన్వాడీ టీచర్స్ పి.జానకి, వరలక్ష్మి, గీతాదేవి, శారద, ఈరమ్మ, వెంకటమ్మ, గౌసియా, ప్రభావతి, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

కౌతాళంలో సిఐటియు ఆధ్వర్యంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రెండో రోజు సమ్మె చేపట్టారు. సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా, బుడ్డప్ప అంగడి, ఖాదర్ లింగస్వామి దర్గా, అంబేద్కర్ సర్కిల్ నుంచి స్టేజి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దీక్షలకు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, కార్యదర్శి మేలిగిరి ఈరన్న మాట్లాడారు. అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి, కాసింబి, కామాక్షి, రాధ, విజయలక్ష్మి, దీప్తి, చాముండి, రత్నమ్మ, సురేఖ, కావేరి, వీరమ్మ, అపర్ణ, గంగమ్మ పాల్గొన్నారు.



ఆలూరు పాత బస్టాండ్ ఆవరణలో మాట్లాడుతున్న వెంకటమ్మ



ఆదోనిలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ



కౌతాళంలో సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

హక్కుల సాధనకు మహా సింహగర్జన

- మాదాసి, మాదారి కురువ సంఘం

ప్రజాశక్తి-ఆలూరు

ఈనెల 24న ఆలూరులో జరిగే మాదాసి, మాదారి కురువ మహా సింహగర్జనను జయప్రదం చేయాలని మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు కోరారు. బుధవారం ఆలూరులోని శశికళ కృష్ణమోహన్ స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణ మోహన్, ఉమ్మడి రాష్ట్రాల మాదాసి, మాదారి కురువ సంఘం వ్యవస్థాపకులు డి.రంగన్న, ఆదోని, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్‌లు మాన్వి దేవేంద్రప్ప, జయరాముడు, ఎంపిటిసి పంచలింగాల నాగరాజు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం (ఆంధ్ర, తెలంగాణ)లో గత 70 ఏళ్లుగా కురువలకు కుల సర్టిఫికెట్ మంజూరు చేయడంలో రెవెన్యూ, పాలకులు, ప్రభుత్వాలు మోసం చేస్తూ కురుబలుగా చిత్రీకరించి బిసి'బి'లుగా సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కురువల కుటుంబానికి దూరంగా గొర్రెలు కాపరులుగా సంచారం చేసేవారని, వారి పరిస్థితులను బట్టి అప్పటి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కుల జాబితాలో షెడ్యూల్డ్ క్యాస్ట్‌లో మాదాసి, మాదారి కురువలుగా చేర్చారని చెప్పారు. కురువలుగా పిలువబడే కులం బీసీ జాబితాలో ఎక్కడా లేదన్నారు. రెవెన్యూ అధికారులకు కురువ కులంతో సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే కురుబ బీసీ 'బి'గా పరిగణించి సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తున్నారని తెలిపారు. కొన్నేళ్లుగా కురువలు రిజర్వేషన్‌కు దూరమై విద్య, రాజకీయంగా తీవ్రంగా నష్టబోయారని చెప్పారు. అందులో భాగంగానే 2013లో జిల్లావ్యాప్తంగా ఆలూరులో కురువ గర్జన సభతో ప్రభుత్వ, పాలకుల కళ్లు తెరుచుకొని రాజకీయంగా కింది స్థాయి పదవులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఇన్నాళ్లు అన్ని కులాల నాయకులకు, పార్టీలకు ఓట్లు వేసి అందళం ఎక్కించామని చెప్పారు. జనాభా ప్రాతిపదకన జిల్లాలో రెండు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ సీట్లు ఇచ్చిన పార్టీకే ఓట్లు వేస్తామని తెలిపారు. 24న జరిగే మాదాసి, మాదారి కురువ సింహ గర్జన సభ ఆలూరు వేదికగా పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం నాయకులు పెద్దయ్య, తిమ్మప్ప, పరమేష్, ఎల్లార్తి దర్గయ్య, కమ్మరచేడు దేవేంద్రప్ప, మురళీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశికళ కృష్ణమోహన్


అధిక వడ్డీ తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యాయత్నం

- పరామర్శించిన జై భీమ్ ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - మంత్రాలయం

అధిక వడ్డీ చెల్లించలేక ఒత్తిడికి గురై సురేష్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతున్న యువకుని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ పరామర్శించారు. బుధవారం వారు మాట్లాడారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ తొర్రెప్ప అలియాస్ లక్ష్మయ్య చిన్న కుమారుడు లక్ష్మప్ప వద్ద అదే గ్రామానికి చెందిన మాదిగ జానప్ప కుమారుడు సురేష్ రూ.2.40 లక్షలను రూ.2 వడ్డీ ప్రకారం అప్పుగా తీసుకున్నారని తెలిపారు. అప్పులో తిరిగి రూ.1.30 లక్షలను 2 నెలల క్రితం చెల్లించారని, మిగిలిన రూ.1.10 లక్షలను 2 నెలలకు ఇస్తానని చెప్పారని అన్నారు. మళ్లీ 20 రోజులకే కచ్చితంగా తనకు డబ్బులు కావాలని, సురేష్ దగ్గర ఉన్న కారును దౌర్జన్యంగా లాక్కున్నారని తెలిపారు. కారును అమ్మి వచ్చిన డబ్బుతో సరిచేసుకొని మిగిలినది తనకు వస్తే ఇవ్వాలని సురేష్ కోరారని చెప్పారు. నానా దుర్భాషలాడి 'నీకు వందకు రూ.2 వడ్డీ కాదు నేను ఇచ్చింది. రూ.25 వడ్డీ' అని బెదిరించారు. 'నీవు రూ.25 వడ్డీ లాగా రూ.5.20 లక్షలు చెల్లించాలి. లేకపోతే నీ ఇంటికొచ్చి నిన్ను కట్టేసి, నీ కుటుంబ సభ్యుల్ని, నీ పిల్లల్ని ఎత్తుకొని అమ్ముతాన'ని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మంగళవారం మళ్లీ లక్ష్మయ్య ఫోన్ చేసి 11న డబ్బులు ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇయ్యలేదని చంపుతానని బెదిరించడం బాధాకరమన్నారు. మనస్తాపానికి గురై కలుదేవకుంట, సూగూరు గ్రామాల మధ్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. రోడ్డు మార్గాన్ని వెళ్తున్న కొందరు గమనించి సురేష్‌ను ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారని వివరించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాదిగ, జిల్లా కన్వీనర్ గంధాలం మణికుమార్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సంగటి యోహాన్ మాదిగ, నందవరం మండల ఉపాధ్యక్షులు ఎర్రన్న మాదిగ, ముగతి ఆదాము పాల్గొన్నారు.





ఆదోనిలో పథకాల వివరాలను వెల్లడిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ శాంత

'గ్రామ స్వరాజ్యం వైసిపితోనే సాధ్యం'

ప్రజాశక్తి - ఆదోని

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే సాధ్యమని మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులు, జెసిఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదన్ శర్మ తెలిపారు. బుధవారం ఆదోనిలోని 14వ వార్డులో ఇన్‌ఛార్జీ రామలింగేశ్వర యాదవ్ ఆధ్వర్యంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం సంక్షేమ పథకాలు నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. గత టిడిపి పాలకులు 600 హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట విస్మరించారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు నేరుగా పథకాలు అందిస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని తెలిపారు. 2024లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, సాయి ప్రసాద్ రెడ్డిని ఆదోని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. **దేవనకొండ** మండలంలోని వెలమకూర్ గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను, సంక్షేమ బోర్డును ఆవిష్కరించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. జెసిఎస్ మండల కోఆర్డినేటర్ రాజారెడ్డి, ఎంపిపి భర్త లుముంబ, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, వైసిపి నాయకులు రామచంద్ర మాట్లాడారు. సంక్షేమ పథకాల కింద గ్రామ సచివాలయ పరిధిలో రూ.14.37 కోట్ల లబ్ధి పొందినట్లు తెలిపారు. వైసిపి నాయకులు గుండు రంగస్వామి, ఆంజనేయులు, సోమన్న, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

ఆర్య వైశ్య ఆఫీసియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వాస్కులర్ హాస్పిటల్ సౌజన్యంతో 17న ఆదోనిలోని శ్రీవాసవి కల్యాణ మండపంలో రక్తనాళాల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్, పట్టణ అధ్యక్షులు మిరియాల శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆదోనిలోని కార్యాలయంలో ఉచిత శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... సుమారు రూ.4,500 విలువ గల పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో గతంలో కూడా వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడంతోపాటు సంతానం లేని వారికి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారన్నారు. రక్తనాళాల సమస్య ఉన్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, రంగ, సభ్యులు రఘు, టిజి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- కొత్తకాపు మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే వైసిపి ధ్యేయమని వైసిపి జిల్లా కోశాధికారి తెర్నేకల్ కొత్త కాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో వైసిపి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో హోళగుంద, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి మండలాల్లో పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బ్యానర్ల ద్వారా ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించి, వలంటీరు వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిట పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర అభివద్ధి కొనసాగాలంటే ఆయనతోనే సాధ్యమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రతిపక్ష టిడిపి ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దళారుల ప్రమేయంతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా కేవలం పచ్చ చొక్కా వారికే దక్కేవన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో దళారుల ప్రమేయం లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడానికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. గత కొన్ని రోజుల క్రితం దేవనకొండలో దళిత రామాంజనేయులు కుటుంబానికి చెందిన గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైందని చెప్పారు. తన వంతుగా రూ.15 వేలు అందించినట్లు తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉండి ప్రజాసేవకు అంకితమవుతానని తెలిపారు. వైసిపి అధిష్టానం ఆదేశిస్తే ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పేర్కొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మధుసూదన్ రెడ్డి (ఫైల్)

భూసేకరణ పూర్తి కాగానే ఇంటి స్థలాలు ఇస్తాం

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

భూసేకరణ పూర్తి కాగానే రెండో దఫా ఇంటి స్థలాలు ఇస్తామని వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం-3 పరిధిలో గల కాలనీలో 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హత ఉండి గతంలో ఇంటి స్థలాలు పొందని వారికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేపడతామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమం వద్దకు వెళ్లి రేషన్, పింఛన్లు పొందుతున్న వారిని ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మిగతా వారికి కూడా త్వరలోనే పింఛన్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు అవసరమని కోరిన వెంటనే డాక్టర్లను పంపించి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, నాయకులు శివకుమార్, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ పుల్లయ్య

రెండో రోజు సమ్మె ఉధృతం

- అంగన్‌వాడీలకు మద్దతుగా పాల్గొన్న టిడిపి నేతలు
- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, నిరసనలు
- మరింత ఉధృతం చేస్తాం : కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు కేంద్రాలకు తాళాలు వేసి చేపట్టిన నిరసన దీక్షలకు టిడిపి నాయకులు సంపూర్ణ మద్దతు తెలియజేసి పాల్గొన్నారు. ఆత్మకూరులో న్యాయ వాదుల సంఘం నాయకులు అంగన్ వాడీలకు మద్దతు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన రహదారులపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. అనంతరం ఆయా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం స్పందించకపోతే మరింత ఉధృతం చేస్తామని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అంగన్వాడీల ఆక్రందన పట్టని సిఎం..? ఎన్ఎండి.ఫరూక్

నంద్యాల కలెక్టరేట్ : సిఎం జగన్ మోహన్ రెడ్డి చేతగాని పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను సర్వనాశనం చేశారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, నంద్యాల అసెంబ్లీ ఇంచార్జ్ ఎన్ఎండి.ఫరూక్, జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సమ్మెకు టిడిపి నేతలు మద్దతు తెలియజేసి మాట్లాడారు. అంగన్వాడీల ఆక్రందన పట్టదా..? అంటూ ముఖ్యమంత్రి జగన్‌ను నిలదీశారు. 2019 ఎన్నికలకు ముందు ఓట్ల కోసం తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా అంగన్వాడీలకు జీతం ఇస్తానని చెప్పిన సైకో జగన్ ఇప్పుడేమో మాట మార్చారని విమర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలకు 4 వేల రూపాయలు ఉన్న జీతాన్ని 10,500 రూపాయలు చేసిన ఘనత చంద్రబాబుదేనని, ఐదేళ్ల పాలనలో జగన్ కేవలం వెయ్యి రూపాయలు పెంచి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. అంగన్వాడీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఎనిమిది నెలలుగా అంగన్వాడీ కేంద్రాలకు అద్దెలు కూడా చెల్లించకపోవడం దారుణమని అన్నారు. చాలీచాలని జీతాలతో కేంద్రాలను నిర్వహించలేక అంగన్వాడీలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. మరోవైపు అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వం వారిని దారుణంగా మోసగిస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేనిపక్షంలో వారికి సంక్షేమ పథకాలయినా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మునగాల విశ్వనాథ్ రెడ్డి, ప్రణవరెడ్డి, దీపక్ రెడ్డి, సుధాకర్, **మిగతా 6వ పేజీలో..**



అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న టిడిపి నేతలు ఎన్ఎండి ఫరూక్, రాజశేఖర్ తదితరులు

నేడు కేంద్ర కరువు బృందం రాక

- పర్యటనను విజయవంతం చేయండి : జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు నంద్యాల జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనుందని, ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డిఆర్ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించే సమయంలో జిల్లాలోని కరువుకు సంబంధించిన సమాచారాన్ని బృందానికి వివరించాలన్నారు. డ్వామా పీడీ బృందానికి లైజనింగ్ ఆఫీసర్‌గా ఉండి జిల్లాలోని కరువు ప్రాంతాలు కవర్ అయ్యేలా చూడాలన్నారు. డ్వామాకు సంబంధించిన పనులను డ్వామా పిడి చూపించాలని చెప్పారు. వాటర్ షెడ్‌కు సంబంధించిన వర్క్స్ కూడా చూపించాలని, నిర్ణీత సమయంలోనే కరువు బృందాన్ని రిసీవ్ చేసుకోవాలన్నారు. సమాచార శాఖ వారు కరువు బృందం పర్యటనకు సంబంధించి వ్యవసాయ శాఖ, వారి సహకారంతో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఇ ఆర్డబ్ల్యూస్ వారు వాటర్ రిసోర్స్ గురించి తెలియచేయాలన్నారు. వ్యవసాయ శాఖ వారు అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సిపిఓ, అర్‌డబ్ల్యూఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చెయ్యడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటు న్నారని తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని, కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్, ఇమెయిల్‌లో సందేశాలు, లింక్‌లు వస్తుంటాయని చెప్పారు. ఆ లింక్‌లను క్లిక్ చేసి మోసపోవద్దని చెప్పారు. ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత బ్యాంక్, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చెయ్యాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cyber crime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

మల్లన్న హుండీ కానుకలు లెక్కింపు

- 28 రోజుల్లో రూ.6.14 కోట్లు ఆదాయం

ప్రజాశక్తి శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో కార్తీక మాసంలో గడచిన 28 రోజులలో భక్తులు స్వామి అమ్మవార్లకు హుండీలలో చెల్లించుకున్న కానుకలను బుధవారం కళ్యాణ మండపంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. కానుకల లెక్కించిగా హుండీలో నగదు రూ.6 కోట్ల 14 లక్షల 22 వేల 180 లభించింది. ఇందులో ఆలయ హుండీల ద్వారా రూ.5 కోట్ల 99 లక్షల 46 వేల 630, అన్న ప్రసాద వితరణ హుండీ (ఈ సంవత్సరం ఏప్రిల్ 26 నుండి) ద్వారా రూ.14 లక్షల 75 వేల 550 లభించాయి. వీటితోపాటు బంగారం 403 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 10 కేజీల 160 గ్రాములు లభించాయి. విదేశీ కరెన్సీలు యుఎస్ఎ డాలర్లు 1118, యూఏఈ దిరహాన్స్ 130, యూకే పౌండ్లు 100, ఆస్ట్రేలియా డాలర్లు 40, మలేషియా రింగిట్స్ 22, కెనడా డాలర్లు 20, సింగపూర్ డాలర్లు 19, యూరోస్ 10 కరెన్సీలు హుండీలలో లభించాయని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఇఒ పెద్దిరాజు

చలికాలంలో ఊటీ టూర్‌కు కౌన్సిలర్లు

- ఆత్మకూరులో రాజకీయంగా చర్చ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకురు మున్సిపాలిటీ పరిధిలో, మండల పరిధిలో వైసిపికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు టిడిపిలో చేరుతున్న నేపథ్యంలో ఆత్మకూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఊటీ టూర్‌కు వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. దాదాపు 18 మంది కౌన్సిలర్లు, వారి కుటుంబ సభ్యులు బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మునిసిపాలిటీ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఊటీ టూర్కు బయలుదేరి వెళ్లారు. ఆత్మకూర్‌లోనే చలి విపరీతంగా ఉండగా చలి ప్రాంతమైన ఊటీకి వీరు బయలుదేరి వెళ్లడం పట్ల ఆత్మకూరు పట్టణంలో రాజకీయ చర్చ ప్రారంభమైంది.



ఊటికి బయల్దేరుతున్న కౌన్సిలర్లు

కౌన్సిలర్లు కొందరు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం పెద్ద ఎత్తున ఆత్మకూరులో కొనసాగుతుంది. చలికాలం ఊటీ టూర్‌కి వెళ్లడం పట్ల రాజకీయ పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. టూర్కు వెళ్లిన వారు టిడిపిలో చేరే అవకాశాలు ఉన్నాయా..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ యాత్రకు వెళ్లిన వారిలో పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి ముఖ్య అనుచరులు కూడా ఉన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, మారుబోతుల విజయ్, హరి ప్రసాద్, ప్రకాష్ రావు, రంగస్వామితోపాటు మహిళా కౌన్సిలర్ల కుటుంబ సభ్యులు ఈ టూర్‌కు వెళ్లారు. కౌన్సిలర్లు టూర్‌కి వెళ్లడం పట్ల పట్టణంలో వేగంగా రాజకీయ పరిణామాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సౌత్‌జోన్ ఫుట్ బాల్ పోటీలకు శాంతిరాం ఫార్మసీ విద్యార్థి

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థి సిఎస్.అతుల్ సౌత్ జోన్ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా సి. మధుసూదన శెట్టి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కుప్పం లోని కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జెఎన్‌టియుఎ సౌత్ జోన్ ఫుట్ బాల్ జట్టు ఎంపిక పోటీలలో అతుల్ అత్యంత ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడని తెలిపారు. ఎంపికైన జట్టు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే సౌత్ జోన్ ఫుట్ బాల్ పోటీలలో పాల్గొంటుదని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్జీయం విద్యాసంస్థల ఎండి శివరాం క్రీడాకారుడిని అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి. ముని శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థి అతుల్‌ను అభినందిస్తున్న దృశ్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా

సిసి రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని 22, 23వ వార్డు పరిధిలో నూతనంగా రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని 24 వార్డుల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేలా మున్సిపల్ కౌన్సిలర్లు ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బోయ పార్వతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్ర పరిశోధనపై పలు నిర్ణయాలు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్ర పరిశోధనపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు రకాల సూచనలు, నిర్ణయాలు తీసుకున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు శ్రీశైలం శిల్ప ప్రాకారానికి సమగ్రమైన మరింత పరిశోధన జరిపి ప్రాకార కుడ్యానికి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ డాక్యుమెంటేషన్ చేయించాలని ముఖ్యులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ అత్యున్నత చాయాచిత్రాలతో, ప్రమాణాలతో తీసిన వాటిని శాశ్వత ప్రతిపాదికన భద్రపరచాలని సూచించారు. వీటన్నింటినీ గ్రంధంలో భద్రపరచాలని, పాఠకులకు చేర్చాలని శ్రీశైల ప్రభ విభాగాన్ని ఆదేశించారు. శిల్ప ప్రాకార విశేషాలను సూచించే వీడియోగ్రఫీని శ్రీశైలం టీవీ ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక ఉత్సవ సమయాలలో ఎల్ఈడి స్క్రీన్‌లలో భక్తులకు చూపించాలన్నారు. కళావేదిక మ్యూజియం, ఆధ్యాత్మిక గ్రంథాలయం, ఆర్ట్ గ్యాలరీ మొదలైన నిర్మాణాలకు స్థల సేకరణను పరిశీలించాలన్నారు. ఏనుగుల చెరువు కట్ట సుందరీకరణకు ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఇఒ పెద్దిరాజు

మోడల్ టెస్ట్ పేపర్లతో ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పదో తరగతి విద్యార్థుల శ్రేయస్సు కోసం సబ్జెక్ట్ నిపుణుల చేత రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్‌లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని డిఇఒ కార్యాలయం ఏడి గోపాల కృష్ణ అన్నారు. యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్‌లను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం బోధన, పాఠశాలల సమస్యల వరకే పరిమితం కాకుండా విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి.ప్రసాద్, జె.సుధాకర్‌లు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా సామాజిక స్పృహలో భాగంగానే యుటిఎఫ్ ఈ మోడల్ టెస్ట్ పేపర్‌లను ప్రతి సంవత్సరం తీసుకువస్తుందని తెలిపారు. అన్ని సబ్జెక్టులు ఇందులో వుంటాయని, ఈ బుక్ ఒక్కటి ప్రిపేర్ అయినా మంచి మార్కులతో పాస్ కావచ్చని అన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వర రెడ్డి, రామకృష్ణ, అరవింద్, మహ్మద్ ఖాసీం, వేంకటేశ్వర్లు, శేఖర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎడి, యుటిఎఫ్ నాయకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

- సిసి రోడ్లు, తాగునీటి బోరును ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని జూటూరు గ్రామంలో రూ. 20 లక్షలతో వేసిన సిసి రోడ్డును ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ కింద నూతన సిసి రోడ్ నిర్మాణానికి భూమి పూజ, ఎంపిపి నిధులతో గ్రామానికి వేసిన తాగునీటి బోరును బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు అందేలా సిఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, జగనన్నకు ప్రజల ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజినీ వర్థినియ, గ్రామ సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, ఎంపీడీవో గోపీకృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, చెలిమిల్ల సర్పంచి కోట్ల చంద్రారెడ్డి, వేంపేంట సర్పంచ్ మాణిక్యమ్మ, రుద్రవరం సర్పంచ్ రామస్వామి, ఇస్కాల సర్పంచ్ మౌలాలి, ఎర్ర గూడూరు ఎంపీటీసీ దర్గా బాయ్, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, డైరెక్టర్ రామసుబ్బయ్య, నాయకులు, ఉప సర్పంచ్ సలాం భాష, మద్దిలేటి, మధుసూదన్ రావు, ఉపేంద్ర, మాలిక్ బాష, బాలీశ్వర్ రెడ్డి, రాజన్న, స్వామి దాసు, దానమయ్య, తిరుపతయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

18న చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని శోభ లాడ్జి పక్కన సిటీ కేబుల్ ఆఫీస్ వద్ద గల చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాయంలో ఈ నెల 18న చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఆకుమల్ల రహీం, అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తాలు తెలిపారు. బుధవారం స్థానిక చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో తోపుడు బండ్లపై, బుట్టలపై, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకునే వారు కాక చిరు వ్యాపారులందరూ కూడా జిల్లా మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చిరు వ్యాపారుల అనేక సమస్యల పరిష్కారం కోసం మన ఐక్యత చాలా అవసరమన్నారు. రోజువారీ గేట్లు ఎత్తివేత, వడ్డీలేని రుణాలను మంజూరు, వ్యాపారాల కోసం ప్రభుత్వ స్థలం కేటాయించడం, సొంత ఇండ్లు లేని వారికి ప్రభుత్వం ఇండ్లు కట్టించి ఇవ్వడం తదితర సమస్యలు చిరు వ్యాపారులు అందరూ ఐక్యమత్యంతో ఉంటే సాధించుకోవచ్చన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ సంఖ్యలో హాజరై మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మదార్ వలి, కోశాధికారి నారాయణ, ఉపాధ్యక్షులు సంజీవ రాజు, సభ్యులు నబిరసూల్, మోదిన్, తిరుమలేశు, ఆటోనగర్ వాసు, ఎన్‌జిఒ కాలనీ సాయి, ఆచారి, రాముడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు ఆకుమల్ల రహీం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం బత్తలూరు సచివాలయ పరిధిలోని నందిపల్లె, బందావనం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 97 శాతం నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, కేడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, ఈఓఆర్డి తాహేర్ హుస్సేన్, విద్యుత్ ఇంచార్జ్ ఏఈ హుస్సేన్ భాష, ఏపీవో గణేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణనాయక్, పంచాయతీరాజ్ ఏఈ కమాల్ సాహెబ్, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం-ఆంధ్రా'పై శిక్షణ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల : నేడు ఆడదాం-ఆంధ్రా కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు, వాలంటరీలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పిల్లలను పనులకు పంపవద్దు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం : బడిఈడు పిల్లలను పనులకు పంపవద్దని, బడికి పంపాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఎంఈఓ లక్ష్మి పిల్లల తల్లిదండ్రులను కోరారు. రుద్రవరంలోని బెస్త కాలనీ, రెడ్డిపల్లె గ్రామాలలో బుధవారం జిఈఆర్ 100 పర్సెంట్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఐదు నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలను బడికి పంపించాలని పనులకు పంపవద్దని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో జిఈఆర్ సర్వే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, కార్యదర్శి చెన్నయ్య, సిఆర్పి రామయ్య, మహిళా పోలీస్ పద్మప్రియ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపి పతనం తప్పదు

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గడపగడపకు వెళ్లి టిడిపి-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో భవిష్యత్తు గ్యారెంటీ గురించి వివరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి చేతగాని పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా వైసిపిని గద్దె దింపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంపల్లె వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, మోహన్, కాంట్రాక్టర్ నన్నెపై గారి జిలాని, మరిపల్లె పాపిరెడ్డి, బొమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె:** వైసిపి రాక్షస పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేకు నాయకులు రంగస్వామి యాదవ్, బాబయ్య, మధు యాదవ్, బాషాల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బుక్ లెట్లను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి నే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సి సెల్ జిల్లా నాయకులు కష్తా నాయక్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజు పాలెం భూషన్న, నాయకులు పసుపల బాల నాయుడు, మంగంపేట రమణ యాదవ్, కంబగిరి యాదవ్, చిన్న రాజుపాలెం నరసింహా, రామాంజనేయులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్యాపిలి :** రాబోయే రోజుల్లో వైసిపికి పతనం తప్పదని టిడిపి డోన్ ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం బండగేరిలోని రాముని గుడి దగ్గర బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రామిరెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్, సుంకయ్య, చల్లా వీరా, సుదర్శన్, సుధాకర్ గుప్తా, నాగేంద్ర, ఎస్ కె వలి, బ్యాంకు శీను, మధు, మొలాల రెడ్డి, ప్రతాప్, శివ, పుల్లారెడ్డి, రంగనాయకులు, రాజు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రజలు కలుపుకొని పని చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య కోరారు. బేతంచెర్ల నగర పంచాయతీలో 14 వార్డు డ్రైవర్ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం స్థానిక టిడిపి నాయకులు మేకల నాగరాజు, రూబిన్, రాంగోపాల్, బూత్ ఇంచార్జ్ కాశాల అంజి ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, నియోజకవర్గ గౌరవ సలహాదారులు కొత్త తిరుమలేష్ చౌదరిలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, నియోజకవర్గ వాణిజ్య కమిటీ ఉపాధ్యక్షుడు జావాజీ వెంకటేశ్వర్లు, మాదినేని నారాయణస్వామి, వేణు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కసపకుంట మధుసూదన్ రెడ్డి, ఐ టిడిపి ప్రధాన కార్యదర్శి వినయ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు కంది కాయల అరుణ్ కుమార్, ఎస్సి సుబ్బారెడ్డి, మురళి, శ్రీపతి నాగరాజు, గిడ్డయ్య, బేబీ, మహిళలు పాల్గొన్నారు. **చాగలమర్రి :** 2024లో ప్రజలు మెచ్చిన ప్రజా ప్రభుత్వం రాబోతుందని టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష తెలిపారు. బుధవారం స్థానిక కోటగడ్డ కాలనీలోని 223 బూత్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ కాలేషా బీబీ, క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా అజీమ్ , తెలుగు యువత అధ్యక్షులు మద్దూరు మహబూబ్ లాల్, పట్టణ ఉపాధ్యక్షులు ముల్లా షాబుల, ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, రియాజ్, జహీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** ఎన్నికలు సమీపిస్తుండడంతో వైసిపి ఎమ్మెల్యే నాయకులు గ్రామాల్లో తిరుగుతూ అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం అవుకు పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నిర్వహించారు. పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన కోటవీధి, కొత్త కాలువ, బిల్డింగ్‌లో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కొందరు వృద్ధులు పింఛన్ రావడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే టిడిపి ప్రభుత్వం వస్తుందని, తప్పకుండా ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి అభివృద్ధి నాలుగున్నర సంవత్సరాల తర్వాత గుర్తుకు వచ్చిందని, ఏదో రెండు రోడ్లు వేసి కోట్ల రూపాయలు అభివృద్ధి జరిగిందని గొప్పలు చెప్పడం, ఇన్ని సంవత్సరాలు గుర్తుకురాని మైనారిటీలకు చెందిన మసీదులకు కంచెను నిర్మిస్తామని చెప్పడం, బలిజ కులస్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చెప్పడం కేవలం ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇది ఒక పెద్ద డ్రామా అని విమర్శించారు. అవుకులో కొన్ని వీధులు మురికి కూపాలుగా మారాయని అన్నారు. ప్రజలకు అభివృద్ధి జరుగుతుంటే తాను ఎప్పుడూ అడ్డు రానని, కేవలం తనపై విమర్శలు చేయడమే వారికి పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఐవి పకీర రెడ్డి, చెన్నంపల్లె చిన్న తిమ్మారెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, తిక్కన్న, అవుకు మండల క్లస్టర్ ఇంచార్జి అరుణ్ కుమార్ నాయక్, క్లస్టర్ ఇంచార్జ్ దంతల రమణ, రాముడు నాయక్, పురుకోస శీను, జై శివుడు, రాజు, షేక్షావలి, నీలి సాయి, బోయ జగన్, సిద్దయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ : భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న భూమా అఖిలప్రియ


బనగానపల్లె : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


ప్యాపిలి : ధర్మవరం సుబ్బారెడ్డికి గజమాలతో సత్కరిస్తున్న నాయకులు


అవుకు : పింఛన్ రావటం లేదని మాజీ ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంటున్న వద్ధురాలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఓటేసి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రజలను కోరారు. బుధవారం డోన్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ సచివాలయం 18, 22, 23వార్డ్ శ్రీ రాంనగర్ కాలనీ పరిధిలో ఆర్థిక శాఖ మంత్రి వర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు 'ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్.జగనే ఎందుకు కావాలంటే ' అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడారు. అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్,పట్టణ జెసిఎస్ కన్వీనర్ కురుకుందు హరి, కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి, శరత్, మహేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీను, దస్తగిరమ్మ, రామాంజి ,గృహ సారథులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ,మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని బలపనూరు మెట్ట వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో డేవిడ్(32) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన స్వామిదాసు వివాహ పత్రికలు పంచడానికి వచ్చి వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి దాసుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పాణ్యంపోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

టిడిపి అధినేత చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి ఏరాసు

ప్రజాశక్తి - వెలుగోడు

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, విఆర్‌కె డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ బి.రాఘవరెడ్డిలు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఏరాసు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాలలో పార్టీ విజయం సాధించడానికి చేపట్టాల్సిన అంశాలను, పార్టీ బలాబలాలను అధినేత చంద్రబాబుతో సుదీర్ఘంగా చర్చించారు. తనకు శ్రీశైలం నియోజకవర్గం నుండి పోటీకి అవకాశం కల్పిస్తే సిద్ధంగా ఉన్నట్లు ఆయన చంద్రబాబు నాయుడుకు తెలిపామన్నారు.


మాజీ సిఎం చంద్రబాబును కలిసిన ఏరాసు ప్రతాప రెడ్డి

ఆధునీకరించిన డోన్ ఆర్‌టిసి బస్టాండ్ ప్రారంభం

- పట్టనంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆర్థికమంత్రి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ప్రగతి వైపు పరుగులు పెడుతోందని పలువురు అభినందించారు. ప్రారంభించిన పనులన్నీ పూర్తి దశకు చేరడంతో ఆర్థిక మంత్రి వరుస ప్రారంభోత్సవాలతో బిజీగా గడిపారు. ఆధునీకరించిన డోన్ ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో ప్రారంభించారు. బస్ స్టేషన్ ముఖ ద్వారంతో పాటు బస్ స్టాండ్ ఆవరణలో మౌలిక సదుపాయాలను ఆధునికీ కరించినట్లు మంత్రి బుగ్గన వెల్లడించారు. రాకపోకలకు సంబంధించి రెండు ముఖ ద్వారాలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, టాయిలెట్స్, భవనానికి రంగులు, ప్రయాణికులకు కుర్చీలు తదితర రూ.45 లక్షలతో పనులు పూర్తి చేయించినట్లు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన మౌలిక సదుపాయాలన్నింటినీ ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం డిపోలో నిర్వహించిన సమావేశంలో డోన్ ప్రజలు, మహిళల నుంచి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గ్రీవెన్స్ స్వీకరించారు. త్వరలోనే ఇంకా పూర్తి దశలో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకువెళుతున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. డోన్ పట్టణంలో నిర్మిస్తోన్న అభివద్ధి పనులు పరిశీలించారు. రూ.10 కోట్లతో నిర్మిస్తోన్న డోన్ ఐటిఐ హాస్టల్ భవనం పనులను మంత్రి పరిశీలించారు. తుది దశకు చేరిన నేపథ్యంలో పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.17 కోట్లతో పూర్తి దశకు చేరిన కూరగాయల మార్కెట్ పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. మార్కెట్ నుంచి నడుస్తూ క్లబ్ హౌస్‌కు వెళుతున్న మంత్రి బుగ్గనకు ఓ ఛాయ్ వాలా ఎదురొచ్చి ఆశ్చర్యపరిచారు. మనస్ఫూర్తిగా చేయి కలిపి మీరు చేస్తున్న అభివద్ధి అంతా ఇంతా కాదని, మీకు తిరుగులేదని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ను కొనియాడారు. ఇన్ని పనులు చేసిన మిమ్మల్ని అభిమానంతో కలవాలనిపించిదయ్యా అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.


ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అనంతరం రూ.4.8 కోట్లతో పూర్తి చేస్తోన్న క్లబ్ హౌస్ భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కొత్త మున్సిపల్ భవనాన్ని జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డికి మంత్రి బుగ్గన చూపించారు. ప్రారంభోత్సవం సమయంలో రాలేదని పాపిరెడ్డి మంత్రికి చెప్పడంతో లోపల మీటింగ్ హాల్ సహా పురభవనాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేశ్, ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, ఆర్‌డిఒ వెంకటరెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, తహశీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు బుధవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు దీప్తి, పార్వతి, మహిళా పోలీస్ రమాదేవి, సాగర్ కుమారి, స్కూల్ హెడ్మాస్టర్ వీర రాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం వల్ల వచ్చే పరిణామాల గురించి వివరించారు. పిల్లలు మంచిగా చదువుకొని, మంచి భవిష్యత్తును పునాదులు వేసుకోవాలన్నారు. చెడు మార్గాలకు వెళ్లకుండా తల్లిదండ్రుల మాట విని మంచిగా చదువుకోవాలన్నారు. బాల్య వివాహం చేసే తల్లిదండ్రులకు, చేసుకునే వరునికి ఫోక్సో యాక్ట్ వర్తింపజేస్తారని, నాన్ బెయిలబుల్ కేసు కూడా ఉంటుందని తెలిపారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్లు



పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని పోస్టల్ ఉద్యోగులు బుధవారం నుండి నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టల్ సంఘ అధ్యక్షులు ఏశావు,నాయకులు శ్రీనివాసులు, మంజునాథరెడ్డి, పినాకిని రెడ్డి, షబానా బేగం, కరిష్మాలు మాట్లాడుతూ ఉద్యోగులకు 8 గంటల పనితోపాటు అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని అన్నారు. తమ డిమాండ్లను ఒప్పుకునే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామన్నారు. సీనియర్ గ్రామీణ తపాలా ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ. 5 లక్షల వరకు పెంచాలన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లని ప్రభుత్వం ఒప్పుకునేంతవరకు ఈ సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

సమయ పాలన పాటించని వైద్యులు

- ఇబ్బందుల్లో రోగులు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, అందుబాటులో లేకపోవడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు పలు ఇబ్బందులు గురవుతున్నారు. డాక్టర్లు ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సి ఉంది. కానీ సమయపాలన పాటించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం తుమ్మలూరు గ్రామానికి చెందిన మహమ్మద్ కుటుంబంతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు టాబ్లెట్ ఇచ్చి పంపారు. బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కూడా కొన్నిసార్లు వచ్చినప్పటికీ వైద్యులు అందుబాటులో లేరని తెలిపారు. డాక్టర్లు అందుబాటులో ఉండి ఓపికి వచ్చిన పేషెంట్లను చూసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న మహమ్మద్



రెండో రోజు సమ్మె ఉధృతం

5వ పేజీ తరువాయి.. మిద్దె హుస్సేనీ, విజయ గౌరీ, కామిని మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో టిడిపి సీనియర్ నాయకులు గోవిందరెడ్డి, గిరిరాజు, నాగూర్ ఖాన్, పట్టణ అధ్యక్షులు వేణు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషాతో పాటు పలువురు నాయకులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అలాగే ఆత్మకూరు న్యాయవాదుల సంఘం నాయకులు గోవిందరెడ్డి, గిరిరాజు, సుదర్శనం, ప్రసాద్, నూర్ అహ్మద్ తదితరులు మద్దతు తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు నరసింహ నాయక్, మా భాష, సురేంద్ర, గణపతి, అంగన్వాడి యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, ప్రియాంక, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు అంగన్‌వాడీలు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహం దగ్గర మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, కొత్తపల్లి, దుద్యాల సెక్టార్ల నాయకురాలు నాగమణి, శ్రీదేవి, రాణెమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలియజేశారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పి.మదార్‌బి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అలాగే జూపాడు బంగ్లా మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ స్థానిక బస్టాండు నుంచి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ ఆఫీస్ వద్ద సమ్మె చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అంగన్వాడి యూనియన్ నాయకులు వెంకటరమణమ్మ, పద్మావతి, ప్రసన్న, ఎపి వ్యకాసం జిల్లా నాయకులు ఎం.కర్ణ మాట్లాడారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, సిఐటియు నరసింహ, రైతు సంఘం నాయకులు ఏసన్న తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** సున్నిపెంట కాలనీలోని అంబేద్కర్ సెంటర్‌లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు కాశమ్మ అధ్యక్షతన నిరసన చేపట్టారు. అంగన్వాడి దీక్షలకు టిడిపి నాయకులు జయసూర్య, ముర్తుజావలి, మహేశ్వర్ రెడ్డి, లాయర్ జాకీర్‌లు మద్దతు తెలియజేసి పాల్గొన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, మండల అధ్యక్షులు వై.శ్రీను, మల్లికార్జున, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బెనహర్, వలి, బాబు, వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల కార్యదర్శి బేస్తరాజు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ నాయకులు వెంకటలక్ష్మి, హరిత పాల్గొన్నారు. **పగిడ్యాల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీలు దీక్ష నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, నాయకులు బాబు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షలకు టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, నాయకులు వాసు రెడ్డి మద్దతు తెలియజేసి మాట్లాడారు. టిడిపి నాయకులు హేమ సుందర్ రాజు, నాగరాజు, పగడం శేఖర్, నాగేశ్వరరావు, సూరి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** స్థానిక బస్టాండ్ సర్కిల్లో అంగన్వాడీ వర్కర్స్ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి.సుబ్బమ్మ, జి.లక్ష్మి కుమారి అధ్యక్షత వహించారు. వ్యకాసం జిల్లా నాయకులు పక్కిరి సాహెబ్, టి.ఓబులేసు, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, పి.లింగస్వామి మాట్లాడారు. యూనియన్ నాయకులు భువనేశ్వరి, ఉమా దేవి, శైలజ, పుల్లమ్మ, జయమ్మ, కైరూన్, రాధిక, నారాయణమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **వెలుగోడు :** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు, హెల్పర్లు వెలుగోడు గ్రామ పంచాయతీ దగ్గర నుండి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ ఎదురుగా నిరవధిక సమ్మెకు కూర్చున్నారు. సమ్మెకు మద్దతుగా అవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ, నూరుల్లా, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు మాట్లాడారు. కార్యక్రమంలో తులసమ్మ, విజయమ్మ, భాగ్యలక్ష్మి, శ్యామల, సాలమ్మ, కుమారి, నాగలక్ష్మి, రాజమ్మ, రాధిక, సునీత, రాధమ్మ, రవణమ్మ, సరస్వతి, శశికళ, భాగ్యమ్మ, సువర్ణ పాల్గొన్నారు. **రుద్రవరం :** అంగన్వాడీలు విధులు బహిష్కరించి తహశీల్దార్ కార్యాలయం ముందు దీక్షలో పాల్గొన్నారు. అంగన్వాడీలకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామ చంద్రుడు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంగయ్య, గిరిజన సంఘం నాయకులు హనుమంతు, నాగమ్మ ఆశ వర్కర్ల యూనియన్ మండల నాయకురాలు కృపావతి, చిన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొని తమ సంఘాల మద్దతును ప్రకటించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్ళు మనోజ, బీబీ, పద్మ, తిరుపాలమ్మ, రాజ్యలక్ష్మి, సరస్వతి, భవాని, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రధాన రహదారి పక్కన సమ్మె కొనసాగించారు. ఈ సమ్మెకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు పూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, మండలంలోని వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరు మండలంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు టిడిపి తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు, అంగన్వాడి నాయకులు వసంత, ఆనందమ్మ, వెంకట రవణమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె నిరసన చేపట్టారు. సమ్మెకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇ నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. వ్యకాసం జిల్లా నాయకుడు దావీదు, అంగన్వాడి యూనియన్ నాయకులు పద్మావతి, రామాదేవి, త్రివేణి, ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, నాగన్న పాల్గొన్నారు. **గడివేముల :** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మె తగ్గేదే లేదని, మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్లా సుబ్బయ్య, కార్యదర్శి రామ్ మద్దిలేటి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్మార్వో ఆఫీస్ సర్కిల్లో అంగన్వాడి వర్కర్స్ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆటో వర్కర్స్ యూనియన్, వివోఏ వర్కర్స్ యూనియన్ మద్దతు తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వసంత లక్ష్మి, నాయకులు రామచెన్నమ్మ, రాములమ్మ, వరలక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు సామన్న, షాకీర్ భాష, సుదర్శన్, లక్ష్మీకాంత్, వివోఏ యూనియన్ నాయకులు పార్వతమ్మ, దీవెనమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం:** పాణ్యం బస్టాండ్ వద్ద సిఐటియు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని నాయకురాలు వెంకటమ్మ అధ్యక్షత నిర్వహించారు. విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, వనం వెంకటాద్రి, నాగరాజు, రాజు మద్దతు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కె.భాస్కర్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు శ్యామలమ్మ, మరియమ్మ, ప్రభావతమ్మ, అనసూయ, ఆదిలక్ష్మి, ప్రభాతమ్మ, బాబు నిషా పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అంగన్వాడీల నిరవధిక సమ్మె ఆళ్లగడ్డలో రెండో రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి వెన్న బాల వెంకట్, పట్టణ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ముంతాజ్ బేగం, పెద్దక్క, శివకుమారి, మౌనిక, శాంత, నరసమ్మ, నాగలక్ష్మి, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలి : మాజీ ఎమ్మెల్యే

బనగానపల్లె : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రెండవ రోజు చేపట్టిన అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే సంఘీభావంగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా ఉన్నప్పుడు పాదయాత్రలో ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడి వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, వేతనాలు పెంచుతామని హామీలు ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రోజా రమణి, వర్కర్లు మల్లేశ్వరి, శశికళ, మహేశ్వరి, సరోజ తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సార్ భాష డిమాండ్ చేశారు. స్థానిక అడ్డవాగు సమీపంలోనే అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నాయకు రాళ్లు పద్మ, వసంత, నాగమణి, సంజమ్మ, ఏఐటియుసి నాయకురాలు చంద్రకళ, వహీదాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన దీక్ష కార్యక్రమాలు రెండో రోజుకు చేరాయి. ఈ ఆందోళన దీక్షకు టిడిపి తమ సంఘీభావాన్ని తెలిపారు. అంగన్వాడీల దీక్షను టిడిపి నాయకులు నిమ్మరసం ఇచ్చి విరిమింపజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, టిఎన్‌సియు నాయకులు గుత్తి నర్సింహులు, పట్టణ ఉపాధ్యక్షులు ముల్లా షాబుల్, ప్రచార కార్యదర్శి ముల్లాగఫార్, ముల్లా అలంషా గారి మాబు షరీఫ్, కొలిమి హుస్సేన్ పీరా, కొలిమి సోను, కొలిమి సాదాబ్ పాల్గొన్నారు.



ఆత్మకూరులో మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు, న్యాయవాదుల సంఘం నాయకులు



బండి ఆత్మకూరులో మాట్లాడుతున్న నాయకులు


బనగానపల్లె : మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


చాగలమర్రి : అంగన్వాడీల దీక్షను విరమింప చేస్తున్న టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాషా


వెలుగోడులో...


పాములపాడులో...


కొలిమిగుండ్లలో...


నందికొట్కూరులో...


పగిడ్యాలలో మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు